క్లుప్తంగా

దారులా డంపింగ్ యార్డులా

సాక్షి విజిట్ కథనానికి స్పందన



జేసీబీ సహాయంతో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: 'దారులా.. డంపింగ్ యార్డు లా' శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ స్పందించారు. ఇబ్రహీంపట్నం కృష్ణ పైపులైన్ వెళ్లే బైపాస్ రోడ్డులో చెత్త, చెదారాన్ని డంప్ చేస్తున్న అంశాన్ని కళ్లకు కట్టినట్లు గా సాక్షిలో కథనం వచ్చింది. కుప్పలు, తెప్పలుగా పడేసిన చెత్తతో ఆయా కాలనీవాసులు ప డుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చింది. దీంతో మున్సిపల్ సిబ్బంది అక్కడ ఉన్న చెత్తకుప్పలను జేసీబీ, ట్రాక్టర్లతో శుభ్రం చేయించారు.

ఆమనగల్లు అభివృద్ధికి రూ.10 కోట్లు



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: టీయూఎఫ్ఐడీసీ కింద వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్లు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన రూ.15 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలోని తన నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ అ భివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మొదట మంజూరైన రూ.15 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, సురసముద్రం చెరువు ఆధునీకరణ, పార్కుల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని స్పష్టంచేశారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

ఎంపీపీ కొప్పు సుకన్య



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణను ఊడుస్తున్న సుకన్య, విజయలక్ష్మి

యాచారం: పరిసరాల పరిశుభ్రత లక్ష్యమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీపీ కొప్పు సుకన్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ అధికారి ఉమారాణి, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పరిసరాలు ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కాలనీల్లోని రోడ్లు శుభ్రంగా ఉంచుకునేలా కృషి చేయాలన్నారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి




వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ కుమార్

తలకొండపల్లి: చంద్రధన గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆ గ్రామ సర్పంచ్ బక్కి కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం సర్పంచ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం సర్పంచ్ కుమార్ చంద్రధనలోమాట్లాడారు. చంద్రధన గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రైతు వేదిక, అండర్ డ్రైనేజీలు, గ్రామ పంచాయతీకి ప్రహరీ, పల్లె దవాఖాన, పశు వైద్య ఉప కేంద్రం, ఫీడర్ చానల్స్, చెక్ డ్యాంలు, గోదాములను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూర్ చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి



మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచాల: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి పాండాల జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మోడీ సర్కార్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలన్నారు. నియోజన వర్గ ఇన్‌చార్జి అఖిల్‌జీ, రాష్ట్ర నాయకుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, మాజీ ఎంపీపీ దన్నె భాషయ్య, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, ప్రధాన కార్యదర్శులు నూకం రాజు, రాజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కాలనీలు కంపు!

- ఆమనగల్లులో పడకేసిన పారిశుద్ధ్యం
- రోడ్ల పక్కనే చెత్తాచెదారం
- అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు అధ్వానం
- సమ్మెలో మున్సిపల్ సిబ్బంది

ఆమనగల్లు: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. పలు వార్డుల్లో పరిస్థితులు పూర్తి అధ్వానంగా మారాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయి. ఆమనగల్లు మొత్తం 15 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీలో ప్రస్తుతం 50 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. నిత్యం ప్రధాన రహదారితో పాటు పలు ముఖ్యమైన రోడ్లను శుభ్రం చేస్తుండగా.. మెజార్టీ కాలనీల్లో రెండు రోజులకోసారి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల కనీసం వారానికి ఒక్కసారైనా రోడ్లు ఊడ్చడం లేదు. దీంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. నూతనంగా వెలిసిన పలు కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగు పేరుకుపోతోంది. పందులు, కుక్కలు ఇందులో చేరి పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మారుస్తున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ సిబ్బంది ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నారు. కేవలం ఉదయం వేళ మాత్రమే కొద్ది సేపు పనిచేసి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతన్నారు.



పోస్టాఫీసు కాలనీలో ఇళ్ల మధ్య మురుగు



శ్రీనివాస కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం



మార్కెట్‌యార్డు సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్లను శుభ్రంచేయాలి



శ్రీనివాస కాలనీలో రోడ్లను శుభ్రం చేయాలి. పలు కాలనీలను రోజుల తరబడి పట్టించుకోవడం లేదు. దీంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. దోమలు నిద్ర పట్టనీయడం లేదు.

– కృష్ణయ్య, శ్రీనివాస కాలనీ

మురుగు నిల్వకుండా చూడాలి



ఇళ్ల మధ్య మురుగు నిల్వకుండా చూడాలి. లేదంటే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. అంతర్గత రోడ్లను నిత్యం ఊడ్చాలి.

– బాలమ్మ, సాయినగర్ కాలనీ

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో, గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని, ప్రజలు హామీలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయ్య, నర్సింహగౌడ్, సాయిలు, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, చంద్రమౌళి, నర్సింహ, రామకృష్ణ, వినోద్ పాల్గొన్నారు.



కడ్తాల్: మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

నాణ్యత లేని చేప పిల్లలు మాకొద్దు

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య

తలకొండపల్లి: నాణ్యత లేని చేప పిల్లలు మాకొద్దని మత్స్యకారులు డిమాండ్ చేశారు. నూరు శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న చేప పిల్లల విషయంలో కాంట్రాక్టర్లు దోపిడీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తలకొండపల్లి మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో చెరువులు, కుంటల్లో వేయడానికి సుమారుగా రూ.6.50లక్షల విలువ చేసే చేప పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని మత్స్యకార సొసైటీల సభ్యులు వాటిని పరిశీలించారు. నాణ్యతలేనివిగా గుర్తించారు. ప్రభుత్వం వారి అభివృద్ధికి కృషి చేస్తుంటే మధ్య, దళారీలు తూట్లు పొడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లేని చేప పిల్లలను అందిస్తున్నారని నిరసిస్తూ మత్స్యకారులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. నాణ్యమైన చేప పిల్లలనే అందివ్వాలని డిమాండ్ చేశారు. చేప పిల్లల సైజు చిన్నగా ఉన్నాయని, పంపిణీలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీల అధ్యక్షుడు లక్ష్మయ్య, వెంకటయ్య, రమేశ్, యాదగిరి, శ్రీను, రామస్వామి, రవి, వెంకటేష్, రాములు, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారుల సొసైటీ సభ్యులు

వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

- భవన నిర్మాణానికి నిధులు మంజూరు
- మెరుగైన సేవలు అందిస్తాం
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రి పనితీరు అధ్వాన్నంగా మారిందని ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చి రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ కల త్వరలో నెలవెరబోతుంది. ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇబ్రహీంపట్నం పర్యటనకు వచ్చినప్పుడు వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని, నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అభ్యర్థనకు స్పందించారు. వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.37.50 కోట్లు మంజూరు చేస్తూ జీవోను జారి చేశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక ఇక్కడ అవుట్ పేషెంట్లకు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లకే వైద్యం నిర్వహించేవారు. గత సంవత్సరం ఆగస్టులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించినప్పటీ నుంచి ఆ ఆపరేషన్లను కూడా చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ ఈ ఆస్పత్రి పనితీరులో పెద్ద మార్పురాలేదు. ఈ దశలో మంత్రి హారిశ్‌రావుకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా విన్నవించడంతో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌తోపాటు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆధునాతన శాస్త్ర సాంకేతిక పరికరాలు, నూతన హంగులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు.



ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రి

మంత్రి హారిశ్‌కు కృతజ్ఞతలు: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌తోపాటు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిన ఆరోగ్యశాఖ మంత్రి హరిశ్‌రావుకు కృతజ్ఞతలు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్నిరకాల ఆధునిక హంగులతో ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తాం. పనులు త్వరలో ప్రారంభిస్తాం.

రుణాలను సకాలంలో చెల్లించండి

సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

హయత్‌నగర్: స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. హయతనగర్ కేంద్రంలో మంగళవారం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పరిధిలో మొత్తం 167మంది రైతులు స్వల్పకాలిక రుణాలు తీసుకోగా 130మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, ఇంకా 37 మందివి మాఫీ కావాల్సి ఉందన్నారు. దీర్ఘకాలిక రుణాలను రూ.14లక్షలు మంజూరు చేశారన్నారు. అనంతరం సంఘం యొక్క జమాఖర్చుల వివరాలను సీఈఓ మల్లికార్జున్ చదివి వినిపించగా సభలో సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, డైరెక్టర్లు ముత్యాల రాజశేఖర్, పెద్దిటి నర్సింహారెడ్డి, దోమలపల్లి అంజయ్య, గడ్డం యాదయ్య, కిన్నెర నర్సమ్మ, జగన్మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్వో పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు రక్తదానం శిబిరం

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం లయన్స్‌క్లబ్, పోలీసు శాఖ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధం

ఆర్డీవో అనంతరెడ్డి సూచన



మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: పోలింగ్ స్టేషన్లను సెక్టార్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా పరిశీలించాలని ఆర్డీవో అనంతరెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అసెంబ్లి ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ సెక్టార్, పోలీసు అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో జరుగబోయే ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లను పోలీసు అధికారులతో కలిసి సెక్టార్ అధికారులు పరిశీలించి, అక్కడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. గతంలో పోలింగ్ తక్కువగా నమోదైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశానికి యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వినాయక నిమజ్జనం

ఇబ్రహీంపట్నం: నవరాత్రులు ముగుస్తుండడంతో బుధవారం నుంచి వినాయక నిమజ్జననానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక పెద్ద చెరువులో పుష్కలంగా నీళ్లున్నప్పటికి పేరుకపోయిన కంప చెట్లతో ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఈ చెరువులో అనుమతించలేదు. ఈ క్రమంలో శేరిగూడ, మల్‌శెట్టిగూడ పరిధిలోని చెక్‌డ్యాం, తట్టిఖానా చెక్‌డ్యాంలోవినాయక నిమజ్జనోత్సవానికి మున్సిపల్ యంత్రాంగం ఏర్పాటు చేసింది. క్రైన్ సహాయంతో విగ్రహాలను చెరువులో వదలనున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చెక్‌డ్యాం వద్ద బారికేడ్లను, విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. ప్రజలు శాంతియుతంగా నిమజ్జనం చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు సీఐ రామకృష్ణ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



విగ్రహాల నిమజ్జనానికి సిద్ధంగా ఉంచిన క్రేన్

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం



కడ్తాల్: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడ్తాల్: ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమని సర్పంచ్ రామునాయక్ అన్నారు. సర్వ్ దివ్యాంగుల సేవా సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో సర్వ్ దివ్యాంగుల సేవా సంస్థ సీబీఆర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రామునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: గ్రామాలు, తండాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానిక ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ఉపాధి లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. తమ స్వంత నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు ఆయన వివరించారు. గ్రామాలలో శిథిలావస్థకు చేరిన ఆలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున ఆర్థికసాయం అందించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, ఖాదర్‌ఖాద్రి, కృష్ణయాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘంతో పాటు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిపారు. ఐలమ్మ చిత్రపటానికి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా తదితరులు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: నివాళి అర్పిస్తున్న రంగారెడ్డి



ఆమనగల్లులో నివాళి



కడ్తాల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



యాచారం: ఐలమ్మ విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో ఐలమ్మ జయంతి వేడుకలు

ప్రభుత్వ భూములను కాపాడాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మంచాల: ఆగాపల్లి గ్రామంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆగాపల్లి గ్రామంలో 187, 191 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్ గ్రూప్ సంస్థ పేరుతో వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేయడం దారుణమన్నారు. కబ్జాకు గురైన భూమి విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. శ్రీ సిటీ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసి స్మశాన వాటిక స్థలం, కుంటలను సైతం వదలకుండా కబ్జాలకు పాల్పడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కన్వీనర్ యాదిరెడ్డి, రాష్ట్ర నాయకుడు కావలి నర్సింహా, జిల్లా నాయకురాలు నీలమ్మ, కృష్ణ, నర్ల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం వేధింపులను అడ్డుకోండి

పత్యానాయక్‌కు మున్సిపల్ కార్మికుల వినతి

ఆమనగల్లు: మున్సిపల్ కార్మికులపై పాలకవర్గం వేధింపులు ఆపాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. కార్మికుల సమస్యలను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేపట్టారు. మంగళవారం వారు పత్యానాయక్‌ను కలిసి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. అకారణంగా వేతనాలు కట్ చేస్తున్నారని వాపోయారు. పాలకవర్గం వేధింపులు ఆపకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని పత్యానాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌నాయక్, వెంకటేశ్, భాస్కర్, యాదయ్య, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పత్యానాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు